క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఉలిందకొండ పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న డాక్టర్ లక్ష్మణ్‌నాయక్

కల్లూరు: సీజనల్ వ్యాధులపై అప్రమతంగా ఉండాలని జోనల్ (కడప) మలేరియా ఆఫీసర్ డాక్టర్ కె.లక్ష్మణ్ నాయక్ వైద్యులను ఆదేశించారు. సోమవారం కల్లూరు మండల పరిధిలోని ఉలిందకొండ ప్రాథమిక ఆర్యోగ కేంద్రాన్ని కర్నూలు జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్‌తో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో పలు రిపోర్టులు, రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఉలిందకొండ గ్రామంలోని వీధులలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీరు నిల్వ ఉన్న పరిసరాలలో అబేట్, బైటెక్స్ ద్రావణాన్ని పంచాయతీ సిబ్బందితో కలసి పిచికారీ చేయించాలన్నారు. వేస్ట్ ఆయిల్‌ను డ్రైనేజీ కాలువలలో చల్లాలన్నారు. డ్రైడే ఫ్రైడే నిర్వహించి డ్రమ్ములు, నీటి తొట్లు, వాడి పడేసిన కూలర్లు, పాత టైర్లలో నీరు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ విజయకుమార్, సూపర్‌వైజర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

31న 'చలో సిద్ధేశ్వరం'



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాయలసీమ సాగునీటి సాధన సమితి, ప్రజాసంఘాల నాయకులు

కల్లూరు: ఈనెల 31న చేపట్టే చలో సిద్ధేశ్వరం పోస్టర్లను సోమవారం చిన్నటేకూరులో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షుడు వాడాల చంద్రశేఖర్‌రెడ్డి, ప్రజా సంఘాల ఐక్య వేదిక రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై సిద్ధేశ్వరం అలుగు ప్రాజెక్టు అవశ్యకత గురించి వివరించారు. కృష్ణానదిపై సిద్ధేశ్వరం గ్రామం దగ్గర అలుగును నిర్మిస్తే రాయలసీమ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందన్నారు. సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాన 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 31 సిద్ధేశ్వరంలో ప్రజా బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలు, నాయకులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామాంజనేయులు, శేషగిరి, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల పరిశీలన



డీఎస్సీ అభ్యర్థికి స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(రూరల్): కర్నూలు నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఖ్యాతి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతులను సోమవారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పరిశీలించారు. తరగతులకు హాజరైన అభ్యర్థులతో మాట్లాడారు. అనంతరం నిర్వాహకులతో కలిసి ఉచితంగా స్టడీ మెటీరియల్ బుక్స్‌ను అభ్యర్థులకు అందజేశారు. సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణ రెడ్డి, ట్రైనరు కళ్యాణ్ కుమార్, డీఎస్సీ అభ్యర్థులు ఉన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి



మహిళలకు సూచనలిస్తున్న జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు

కోడుమూరు రూరల్: మహిళలంతా వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా రోగాలకు దూరంగా ఉండవచ్చునని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు సూచించారు. సోమవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సిబ్బంది ప్రజలకందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ వల్ల చాలా మంది మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చిన్న వయసులో గర్భం దాల్చటం, ఎక్కువ సార్లు గర్భం దాల్చడం, వ్యక్తిగత శుభ్రత పాటించకపోవడం, సురక్షితంకాని లైంగిక పద్ధతుల వల్ల క్యాన్సర్ బారిన పడుతున్నారని, ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్ నుంచి బయటపడవచ్చునన్నారు. వైద్యులు అఫాన్ మహమ్మద్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలం చెల్లిన ప్రాంతీయ ప్రయోగశాల

- శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధం
- భవనం గోడల్లోకి చొచ్చుకుపోయిన చెట్ల వేర్లు
- వైద్య పరికరాలకు తుప్పు
- 75 శాతం పోస్టులు ఖాళీ
- వైద్య పరీక్షలు ఉఫ్‌కాకి.. కేవలం నీటి పరీక్షలే



కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణలోని ప్రాంతీయ ప్రయోగశాల



ప్రాంతీయ ప్రయోగశాల భవనం

కర్నూలు(హాస్పిటల్): ఇప్పటిలా పెద్ద కార్పొరేట్ ల్యాబ్‌లు లేని పరిస్థితుల్లో ఇదే పెద్ద దిక్కు. ఇక్కడి నివేదికలే వైద్యులకు గీటురాయి. ఇక్కడి నివేదికల ఆధారంగానే రోగులకు వైద్యం అందించే డాక్టరు ఎందరో ఉండేవారు. అంతేకాదు నీటి నమూనాలను సైతం తెచ్చి మరీ పరీక్ష చేయించుకుని వాడుతున్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణలోని ప్రాంతీయ ల్యాబొరేటరీ శిథిలావస్థకు చేరుకుంది. ఏ క్షణం కూలిపోతుందోనని అక్కడి అధికారులు, ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. బయోమెడికల్ పరీక్షలు అటకెక్కగా ప్రస్తుతం కేవలం నీటి పరీక్షలు చేయడానికి మాత్రమే ఇది మిగిలి ఉంది.

కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణలోని ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటైన రీజనల్ ల్యాబ్ (ప్రాంతీయ ప్రయోగశాల, కర్నూలు) కళాశాలలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ నియంత్రణలో పనిచేస్తుంది. నాలుగున్నర దశాబ్దాల క్రితం రాయలసీమ ప్రాంతానికి కర్నూలులో, కోస్తా ప్రాంతానికి గుంటూరులో, ఉత్తర కోస్తాకు విశాఖపట్టణంలో ఈ ప్రాంతీయ ప్రయోగశాలలను ఏర్పాటు చేశారు. అప్పట్లో ఆసుపత్రుల్లో లేని వైద్య పరీక్షలను హైదరాబాద్, చెన్నై, ముంబయి వంటి నగరాలకు పంపించేవారు. దీంతో ఆయా పరీక్షలన్నీ ఇక్కడే చేయాలన్న ఉద్దేశ్యంతో ప్రాంతీయ ప్రయోగశాలను ఏర్పాటు

కొత్త ల్యాబోరేటరీకి దిక్కులేదు

వరదల్లో దెబ్బతిన్న ఈ ప్రాంతీయ ప్రయోగశాలకు అప్పట్లోనే కళాశాలలో కొత్త భవనం నిర్మించాలని తలచారు. అప్పటి అధికారులు కళాశాలలో తగిన స్థలాన్ని చూపడంలో విఫలమయ్యారు. జిల్లా అధికారులు సైతం ఈ ల్యాబోరేటరీకి అవసరమైన స్థలాన్ని ఇతర ప్రాంతాల్లోనైనా చూసి నిర్మించాలన్న ఆలోచన మరిచారు. దీంతో శిథిల పరిస్థితుల్లోనే ప్రాంతీయ ప్రయోగశాల కొనసాగుతోంది. ప్రస్తుతం అందులోని గోడల్లో చెట్ల వేర్లు చొచ్చుకుపోయాయి. ఎక్కడ చూసినా దుమ్మూ, ధూళి నిండింది. ఏ క్షణాన ఈ భవనం కుప్పకూలుతుందో చెప్పలేని పరిస్థితి. బయట ఉన్న రెండు గదుల్లో మాత్రమే వైద్యులు, సిబ్బంది పనిచేస్తున్నారు. అవి కూడా పాతబడిపోయాయి. ఎప్పుడు కూలబడిపోతుందోనని వారు ఆందోళన చెందుతున్నారు.

చేశారు. ఈ మేరకు ఇందులో మైక్రోబయాలజిస్టు, పెథాలజిస్టు, బయోకెమిస్ట్ వైద్యులతో పాటు పారా మెడికల్ ఆఫీసర్/వాటర్ అనలిస్టు, ఒక వాటర్ అనలిస్ట్, ఫుడ్ అనలిస్ట్ పోస్టులు మూడు, కంప్యూటర్ ఆపరేటర్, రెండు వాచ్‌మెన్, ఒక క్లర్క్, ఒక స్వీపర్, రెండు జేఎస్‌ఓ, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ నాలుగు పోస్టులు, ల్యాబ్ అటెండెంట్ పోస్టులు మూడు, శ్యాంపిల్ టేకర్ ఒకటి, రెండు జూనియర్ అనలిస్టు పోస్టులను క్రియేట్ చేశారు. కానీ ప్రస్తుతం ముగ్గురు వైద్యులు ఫారిన్ డిప్యుటేషన్‌పై, ఇద్దరు వాటర్ అనలిస్టులు, ఇద్దరు శాంపిల్ టేకర్లు, ఒక అటెండర్/వాచ్‌మన్ మాత్రమే ఉన్నారు. ఒకప్పుడు ఇక్కడ మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, పెథాలజీ పరీక్షలతో పాటు వాటర్, ఫుడ్ అనలిస్ట్ పరీక్షలు కూడా చేసేవారు.

కేవలం నీటి పరీక్షలు మాత్రమే!

2009లో కర్నూలు నగరాన్ని వరదలు ముంచెత్తాయి. ఈ సమయంలో రీజనల్ ల్యాబొరేటరీ సైతం బాగా దెబ్బతింది. అందులోని వ్యాధినిర్ధారణ పరీక్షలు చేసే వైద్య పరికరాలు దెబ్బతిన్నాయి. ఈ కారణంగా అప్పటి నుంచి ఇక్కడ వైద్య పరీక్షలు నామమాత్రమయ్యాయి. కొంతకాలం టీసీ డీసీ, ఈఎస్ఆర్, హిమోగ్లోబిన్, సిరాలజీ, ఆర్ఏ ఫ్యాక్టర్, ఏఎస్ఓ, హెచ్‌బీఎస్ఏజీ, హెచ్‌సీవీ, వైడాల్, వీడీఆర్ఎల్, బ్లడ్ యూరియా, క్రియాటినిన్, యూరిక్ యాసిడ్, మాంటాక్స్ వంటి పరీక్షలు చేశారు. ఐదేళ్ల



భవనం గోడలోకి చొచ్చుకుపోయిన చెట్టు వేర్లు

నుంచి అవి కూడా చేయడం లేదు. ప్రస్తుతం కేవలం నీటి పరీక్షలు (వాటర్ అనలిస్టు) మాత్రమే నిర్వహిస్తున్నారు. వీటి ద్వారా నెలకు రూ.లక్ష రెవెన్యూ వస్తోందని అధికారులు చెబుతున్నారు. ఎవరైనా నీటి పరీక్షలు చేయించుకోవాలనుకుంటే ఇక్కడికి తెచ్చి ఇవ్వవచ్చు. ఇందుకు నిర్ణీత రుసుము రూ.280 ఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. పండుగలు, పర్వదినాలు, అంటువ్యాధులు ప్రబలిన ప్రాంతాలతో పాటు మున్సిపల్, పంచాయతీలకు ఇక్కడి సిబ్బంది నేరుగా వెళ్లి నీటి నమూనాలు తీసుకొచ్చి పరీక్షలు చేసి నివేదికలు ఇస్తారు.

22న హనుమాన్ జయంతి



ప్రచార బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న ధార్మిక సంస్థల ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 22న హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేడుకలకు సంబంధించిన బ్యానర్లను ధార్మిక సంస్థల ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓర్వకల్లులోని ఆంజనేయ స్వామి దేవస్థానం, హొళగుందలోని ఆంజనేయ స్వామి దేవస్థానం, గోనెగండ్లలోని సీతారామాంజనేయ స్వామి దేవస్థానం, నందికొట్కూరులోని రామాలయం, జూపాడుబంగ్లా మండలం పారుమంచాల లోని ఆంజనేయ స్వామి దేవస్థానాల్లో ఉదయం ఆంజనేయ స్వామికి పంచామృతాభిషేకం, సింధూరాభిషేకం, ఆకుపూజ, విశేషార్చనలు, హనుమాన్ చాలీసా పారాయణం, భజనలు, సాయంత్రం నాలుగు గంటలకు యవతలో దేశభక్తి భావన కలిగించి, శక్తి ఉపాసకులవుటకు స్థానిక భక్తాదులచే శోభాయాత్రలు, ప్రసాద వియోగం, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

యువతి అదృశ్యం

తుగ్గలి: యువతి అదృశ్యమైన ఘటన తుగ్గలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఎద్దులదొడ్డికి చెందిన హెచ్ బాలరాజుకు ఐదుగురు కూతుళ్లు. వారిలో నాల్గవ కూతురు సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల గాలించిన ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆటలో గెలుపోటములు సహజం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: క్రీడాల్లో గెలుపు ఓటములు సహజమని, వాటిని సమానంగా స్వీకరించాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 28వ వార్డు లక్ష్మీపురంలో ఎబీఎమ్ చర్చి 18వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కబడ్డీ పోటీలను నిర్వహించారు. కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించి, క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో 28వ వార్డు కార్పొరేటర్ నారాయణరెడ్డి, సత్యంరెడ్డి, శేషారెడ్డి, తిరుపాల్, బాబు, కృపానందం, శివశంకర్‌రెడ్డి, భీమేశ్వర్‌రెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించండి

- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 26 దరఖాస్తులు



కమిషనర్ రవీంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న అర్జీదారులు

కర్నూలు (టౌన్): 29వ వార్డు ఉద్యోగ్ నగర్‌లో డ్రైనేజీ కాల్వలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు ఉమేష్, శ్రీనివాసరెడ్డి, అన్సర్ విన్నవించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 26 మంది తమ కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు సమర్పించారు. దరఖాస్తులు స్వీకరించిన కమిషనర్ మాట్లాడుతూ.. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ఎంఈ సత్యనారాయణ, ఆర్‌ఓ జునీద్, టీపీఆర్‌ఓ వెంకట లక్ష్మీ, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్ బాషా, సర్వేయర్ నాగరాజు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

➡ ఠాగూర్ నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షం కురిసినప్పుడు మురుగు నీరు నిలిచిపోతుందని స్థానికులు ప్రసాద్‌బాబు, కై లాష్, దిలీప్ విన్నవించారు.

➡ 27వ వార్డు ఆదిత్య నగర్‌లో డ్రైనేజీ కాల్వలు నిర్మించాలని స్థానికులు ప్రసాద్, భాస్కర్ రెడ్డి, శర్మ అభ్యర్థించారు.

➡ లక్ష్మీనగర్‌లో ఉత్తరం వైపు మురుగు కాల్వలు లేనందున ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు సంజమ్మ, మమత, వరలక్ష్మీ, సంధ్యా విన్నవించారు.

➡ విజయలక్ష్మీనగర్‌లో మురుగు కాల్వలు వెడల్పు చేయాలని స్థానికులు శారద, రమేష్, శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు.

➡ టిడ్కోలో ఇంటి కోసం డిపాజిట్ చెల్లించామని, తాము చెల్లించిన నగదు వాపసు ఇప్పించాలని ఇందిరాగాంధీ నగర్‌కు చెందిన షంషాద్ బేగం విన్నవించారు.

➡ బండిమెట్ట కాలనీలో మురుగు కాల్వలు నిర్మించాలని స్థానికులు సాధిక్, అమీర్, బషీర్, ఇబ్రహీం అభ్యర్థించారు.

కాంట్రాక్టర్లు సకాలంలో పనులు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు (టౌన్): అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయకుండా ప్రభుత్వానికి, ప్రజా ప్రతినిధులకు చెడ్డపేరు తీసుకురావొద్దని రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. సకాలంలో పూర్తి చేయని కాంట్రాక్టర్ల పేర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని కమిషనర్‌ను మంత్రి ఆదేశించారు. సోమవారం స్థానిక స్టేట్ బ్యాంకు ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబుతో కలిసి మున్సిపల్ కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈ నెలాఖరులోగా పనులు ప్రారంభించాలన్నారు. పనులు ప్రారంభించకుంటే వాటిని రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పారిశుధ్య విభాగం ఆరోగ్యశాఖ అధికారి, పారిశుధ్య పర్యవేక్షక అధికారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయాల సిబ్బందితో కలిసి మంత్రి పారిశుధ్య విభాగంపై సమీక్ష నిర్వహించారు.

పొగాకును గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న కె.జగన్నాథం

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం మేరకు నల్ల, తెల్ల బార్లీ పొగాకును గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. నల్లబార్లీ పొగాకును కొనుగోలు చేయడంలో కంపెనీలు సిండికేట్‌గా మారి రైతుల కష్టార్జితాన్ని కాజేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరితో కంపెనీలు పొగాకును కొనుగోలు చేయడం లేదన్నారు. ఫలితంగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కంపెనీలపై ఒత్తిడి తెచ్చి పొగాకును గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలన్నారు. రైతు సంఘం జిల్లా సహాయ కారదర్శి దంబోళం శ్రీనివాసరావు, రమేష్ పాల్గొన్నారు.

ఇదేం.. కక్ష సాధింపు పాలన



పూర్తి కావొచ్చిన నూతన భవన నిర్మాణం



పనులు నిలిచిపోవడంతో దర్శనమిస్తున్న మొండి గోడలు

- ఏడాది కాలంగా ఎక్కడి పనులు అక్కడే
- రూ.28 కోట్లతో నిర్మాణం చేపట్టిన కార్పొరేషన్ బిల్డింగ్‌కు గ్రహణం
- పాత భవనంలో ఉద్యోగులకు తప్పని ఇబ్బందులు

కర్నూలు (టౌన్): ఎప్పుడో 1978లో నగరపాలక పాలక సంస్థ కార్యాలయం నిర్మించారు. అప్పటి జనాభాకు అప్పటి ఉద్యోగుల సంఖ్యకు సరిపోయింది. ఈ భవనం నిర్మించి 47 ఏళ్లు దాటింది. వర్షం వస్తే కారుతుంది. విద్యుత్ కనెక్షన్ దెబ్బతిని గోడలు షాక్ కొడుతున్నాయి. అప్పటికప్పుడు తాత్కలికంగా రిపేరు చేసుకోవడమే తప్పా.. కొత్త భవనం నిర్మించాలన్న ఆలోచన పాలకులు, అధికారులకు రాలేదు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని హంగులతో, అత్యాధునిక వసతులతో, పేపర్ లెస్ పాలనకు శ్రీకారం చుడుతూ కార్పొరేట్ స్థాయిలో నగరపాలక సంస్థ నూతన భవనానికి శ్రీకారం చుట్టింది. అంతే స్థాయిలో పనులు చకచకా సాగాయి. రెండేళ్లు పనులు యుద్ధ ప్రాతిపదికన సాగాయి. తర్వాత ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతున్న కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు. మాకేం సంబంధం అన్నట్లు నేతలు వ్యవహరిస్తున్నారు. దీంతో భవన నిర్మాణానికి గ్రహణం పట్టుకుంది.

2022లో రూ.28 కోట్లతో పనులకు శ్రీకారం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2022 ఆగస్టులో నగరపాలక సంస్థ నూతన భవనాన్ని నిర్మించాలని అప్పటి మంత్రి ఆదిమూలపు సతీష్ శిలాఫలకం ఆవిష్కరించారు. రూ.28 కోట్లు జనరల్ ఫండ్ నిధులు కేటాయించారు. పనులను దక్కించుకున్న వైఎస్సార్ జిల్లాకు చెందిన మునుస్వామి రెడ్డి చకచకా పనులు చేపట్టారు. రెండేళ్లు సజావుగా సాగాయి. ఇప్పటికే ఈ నిర్మాణం కోసం నగరపాలక సంస్థ ప్రాంగణంలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయం, నగరపాలక సంస్థకు అనుబంధంగా ఉన్న బ్యాంకును కూల్చేశారు. అలాగే మరి కొన్ని నిర్మాణాలు తొలగించారు. పనులు యుద్ధ ప్రాతిపదికన 70 శాతం పూర్తయ్యాయి. చిన్నపాటి పనులు, ప్యాచ్ వర్కులు, గ్రీనరీ వంటి పనులు పూర్తి చేయాల్సి ఉంది. అ స్థితిలో గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అంతే పనులు నిలిచిపోయాయి. రూ.కోట్లు వెచ్చించి ముస్తాబవుతున్న నగరపాలక సంస్థ నూతన భవన నిర్మాణానికి బ్రేకులు పడ్డాయి. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కనీసం మిగతా పనులు పూర్తి చేస్తే నేతలకు, అధికార యంత్రాంగానికి మంచి పేరు వస్తుంది. అయినా నేతలు పట్టించుకోవడం లేదు. రూ.5 కోట్లు వెచ్చిస్తే పనులు క్లియర్ అవుతాయని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. అయినా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొదలుపెట్టిన నిర్మాణం కదా అని కూటమి నేతలు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు

ఉన్న వాటిని కూల్చేశారు. నిర్మాణం పూర్తి చేద్దామంటే డబ్బులు ఇవ్వరు. జాప్యం చేస్తున్నారు. దీంతో



నగరపాలక సంస్థ నూతన భవన నమూనా

ఇరుకుగా ఉన్న గదుల్లోనే ఇబ్బందులు పడుతూ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. నిత్యం విధుల్లో భాగంగా వచ్చే సచివాలయాల ఉద్యోగుల ఇబ్బందులు అంత ఇంత కావు. ఇక మేనేజర్ చాంబర్‌లోనే టీపీఆర్‌ఓ, సెక్షన్ సూపరింటెండెంట్ ఇలా... ఇరుకుగానే ఇబ్బందులు పడుతూ పాలన కొనసాగిస్తున్నారు. పన్నులు చెల్లించేందుకు, వివిధ పనుల కోసం వచ్చే ప్రజల ఇబ్బందులు అన్ని ఇన్ని కావు. ఇక పాలక వర్గానికి సంబంధించి డిప్యూటీ మేయర్లకు ప్రత్యేక గదులు లేవు. స్టాండింగ్ కమిటీ సభ్యులు, మహిళా కార్పొరేటర్లకు గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పనులు పూర్తి చేయడంపై కూటమి నేతలు దృష్టి సారించాలి. పట్టు విడుపులు లేకుండా కార్పొరేషన్ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఉద్యోగులు కోరుతున్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు 691 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 59 పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన సెమిస్టర్ పరీక్షలకు 691 మంది గైర్హాజరయ్యారు. 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 7277 మందికి 6586 మంది హాజరు కాగా 691 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఒక విద్యార్థి చూచి రాతకు పాల్పడగా గుర్తించి డిబార్ చేసినట్లు పేర్కొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి కృషిచేసిన మహనీయుడు సుందరయ్య



సుందరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి కృషిచేసిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. సోమవారం సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమాన్ని సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా సుందరయ్య విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కల్లూరు అర్బన్ 32వ వార్డు సుందరయ్య నగర్‌లోని సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పీఎస్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్కెట్ యార్డులో నగర కార్యదర్శి టి.రాముడు ఆధ్వర్యంలో, సుందరయ్య సర్కిల్‌లో సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు నరసింహులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుందరయ్య చిత్రపటానికి జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టి.రాముడు, పీఎస్ రాధాకృష్ణ, సాయిబాబా పాల్గొన్నారు.

నీలం సంజీవరెడ్డికి నివాళి



నీలం సంజీవరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కర్నూలు (అగ్రికల్చర్): స్థానిక అబ్బాస్ నగర్‌లోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు రంగారెడ్డి మాట్లాడుతూ.. తెలుగు వారి ఖ్యాతిని జాతీయ స్థాయికి తీసుకెళ్లిన మొదటి వ్యక్తి నీలం సంజీవరెడ్డి అన్నారు. పదవులకే వన్నె తెచ్చిన మహా వ్యక్తి అని కొనియాడారు. అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.